క్లుప్తంగా

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



ఉపాధ్యాయులకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో అధ్యక్షుడు చిన్నం మనీంద్ర ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా జరిగింది. సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన ఎం.సత్యనారాయణ, కే.హెప్సిబా, వి.విశాలి, పి.విఘ్నేశ్వరరావు, కె.రామలక్ష్మి దేవి, బి.లావణ్య, కేవీ గణపతిరావు, సీహెచ్ బి.రవికుమార్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ త్రిమూర్తులు, క్లబ్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు మంచి పరిణామం

తణుకు అర్బన్: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న జీఎస్టీ సవరింపు ద్వారా దేశ ప్రజానీకానికి దీపావళి, దసరా పండుగలు ముందుగానే వచ్చాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ముళ్లపూడి రేణుక అన్నారు. తణుకులోని ఆమె నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అనువుగా ఉండేలా ధరలు తగ్గే విధంగా జీఎస్టీ తగ్గింపును ప్రతి ఒక్కరూ స్వాగతించాలని అన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యాపారాలకు సంబంధించి సామగ్రిపై జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారన్నారు. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి ఇన్సూరెన్స్ పాలసీల్లో జీఎస్టీని తొలగించారని స్పష్టం చేశారు.

కారుమూరి పరామర్శలు



సుబ్బరాజును పరామర్శిస్తున్న కారుమూరి

తణుకు అర్బన్: ఇరగవరం మండలం కావలిపురం గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజును మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఇటీవల సుబ్బరాజు అత్త, మామలు మరణించిన కారణంగా ఆయన నివాసానికి వెళ్లిన కారుమూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మరణించిన కారణంగా గురువారం కాకినాడలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కుళ్లిన వరిచేలు.. ఆగని కన్నీరు!

- పంటను నిలబెట్టేందుకు నానా అగచాట్లు
- తిరిగి ఊడ్చేందుకు రైతులు సన్నద్ధం
- ప్రభుత్వం నుంచి సాయం అందక ఇబ్బందులు



పెంటపాడు, కె. పెంటపాడు ఆయకట్టులో కుళ్లిన వరి పొలాలు

పెంటపాడు: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్నారు. పంట పండితే ధరలేక, పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి సాయం రాక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంటపాడు మండలం పూర్తిగా డెల్టా ప్రాంతం కావడంతో 24 వేల ఎకరాలకు గాను నాట్ల సమయంలో సుమారు మూడో వంతు వర్షాల వల్ల దెబ్బతింది. సుమారు 15 రోజులు నీటిలో మునిగి ఉన్న నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తుఫాను వల్ల దెబ్బతిన్న చేలను ఆలానే వదిలేస్తే దిగుబడి వచ్చే అవకాశం లేదు. కాగా మళ్లీ నాట్లు వేద్దామంటే నారు దొరకని పరిస్థితి. అయితే తాజాగా పలు గ్రామాల్లో నారు దొరకని పరిస్థితుల్లో నాటిన చేల నుంచి దుబ్బులను సేకరించి దెబ్బతిన్న చేలలో నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే సుమారు రెండు వేల ఎకరాలలో అలానే నాట్లు వేస్తున్నారు. గతంలో ఊడ్చిన చేలే మళ్లీ నాట్లు వేస్తున్నారు. పెంటపాడు మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎనిమిది గ్రామాల్లో పంట నీటమునిగి రైతులు నష్టపోయారని అధికారులు తెలిపారు.

అయితే వర్షాలతో పాటు, ముంపునీరు డ్రెయినేజీల ద్వారా ప్రవహించకపోవడంతో ప్రధానంగా పెంటపాడు, కె. పెంటపాడు, యానాలపల్లి ప్రాంతాల్లో భారీగా నాట్లు దెబ్బతిన్నాయి.



నారు కొరతతో యానాలపల్లి గ్రామంలో వరిదుబ్బులను తెచ్చి కట్టలు కడుతున్న రైతులు



తుఫానుకు దెబ్బతిన్న ప్రాంతాలలో వరి దుబ్బులతో మళ్లీ నాట్లు వేసిన దృశ్యం

ప్రభుత్వ సాయం లేక ఇబ్బందులు: అకాల వర్షాల వల్ల ప్రజాప్రతినిధులతో పాటు, కేంద్రబృంద ప్రతినిధులు దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి వెళ్లారే తప్ప రైతులను ఆదుకొనేందుకు ఏ ప్రకటనా చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న రైతులను ఆదుకొనేందుకు తక్షణ సాయం చేసేవారు. నారు కొరత ఉంటే ప్లాంటేషన్ ద్వారా నారు సరఫరా, విత్తనాలు అందించే ఏర్పాట్లు ఉండేది. ఎరువులు సబ్సిడీపై అందించేవారు. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులను ఆదుకొంటామని ప్రకటనలే తప్ప ఆచరణ శూన్యం. ప్రస్తుతం ఎరువులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధిక వర్షాలతో ముప్పు



నాట్లు వేసిన నెల రోజుల తరువాత తుఫాను వల్ల మా పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా వేసవిలో ప్రతి ఏటా డ్రెయినేజీలు బాగుచేసేవారు. అయితే ఈ ఏడు వర్షాలు కురవడంతో సకాలంలో నాట్లు వేసాం. అకాల వర్షాలు మా పంటను ముంచాయి. అయితే మళ్లీ నారుమడులు వేసేందుకు పంట ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. తరువాత దాళ్వా కూడా ఆలస్యం అవుతుంది. మా చేలలోని వరి దుబ్బులే పీకి దెబ్బతిన్న చేలలో నాట్లు వేస్తున్నాం. అదనపు ఖర్చు అయినా తప్పదు.

– సుంకర వెంకటేశ్వర్లు, యానాలపల్లి కౌలురైతు

లింగ వివక్ష చట్టరీత్యా నేరం



జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం నెం.141 అంగన్‌వాడీ కేంద్రంలో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆడ, మగపిల్లల్ని సమానంగా పెంచాలన్నారు. ఆడ, మగ పిల్లల మధ్య తేడాలు చూపరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ. తులసీరాణి, టి.రామలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు వాసవీ ఆచార్యులు

తాడేపల్లిగూడెం: పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆచార్య కుసుమకుమారి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు తెలిపారు.

తణుకులో గణనాథుడి నిమజ్జనాల సందడి



తణుకు శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని కొచ్చెర్లకోట వీధి భారీ గణనాథుడు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో బుట్ట బొమ్మల సందడి

- నిమజ్జనానికి తరలిన కొచ్చెర్లకోట వారి వీధి గణనాథుడు
- లడ్డు ప్రసాదం పాట రూ. 81 వేలు

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాలు 9వ రోజు సందర్భంగా గణనాథుడి విగ్రహాల నిమజ్జనాలతో తణుకు పట్టణంలో సందడిగా మారింది. ఎటుచూసినా గణనాథుడి విగ్రహాల ఊరేగింపులతో తణుకు ప్రాంతం భక్తుల తాకిడికి రహదారులన్నీ కిటకిటలాడాయి. ముఖ్యంగా తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో తెలంగాణ నుంచి తీసుకువచ్చిన భారీ గణనాథుడి తణుకు పట్టణానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వాహనంలో స్వామివారిని ఆశీనులను చేయగా, ఊరేగింపులో బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మల, దేవతామూర్తుల రథంతో స్వామివారు నిమజ్జనానికి తరలివెళ్లారు. స్వామివారి నిమజ్జన ఊరేగింపును తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

స్వామివారి లడ్డు పాట రూ. 81వేలు..

తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన గత తొమ్మిది రోజులుగా స్వామివారి ముందు లడ్డును పట్టణానికి చెందిన సంభవ్ జ్యూయలర్స్ యాజమాన్యం రూ. 81వేలకు పాడుకున్నారు. చిన్న లడ్డును మాటూరి చలపతి రూ. 21వేలకు, వెండి వినాయక ప్రతిమను గాయత్రీ ఇంజనీరింగ్ వర్క్స్ చలం రూ. 7600, స్వామి వస్త్రాన్ని ప్రవీణ్ రూ. వెయ్యికి వేలంలో పాడుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

అత్తిలి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ మక్కాసూర్యరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ పై ప్రజాప్రతినిధులు, లైన్ డిపార్టుమెంట్ అధికారులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందడానికి ఎటువంటి సదుపాయాలు అవసరమో అధికారులు గుర్తించాలని కోరారు. ఎంపీడీవో పి శామ్యూల్ మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల నుంచి వృద్ధుల వరకు అందజేస్తున్న సదుపాయాలను తెలియజేయాలని, అవసరాలను తెలుసుకోవాలని కోరారు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం తొమ్మిది లక్ష్యాలను నిర్దేశించిందని తెలిపారు. లక్ష్యాల సాధనకు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు తగు సలహాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, కొనకళ్ళ విజయనిర్మల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి శామ్యూల్

దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశాభివృద్ధిలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని డైమండ్స్ లయన్స్ అడ్మిన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా గవర్నర్ ఎస్వీవీఎస్ పాపారావు నాయుడు వన్ డ్రిస్టిక్, వన్ ప్రోగ్రాం పిలుపులో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తుగా జరిపారు. ఉపాధ్యాయులను సన్మానించారు. లయన్స్ విజయ్‌కుమార్ రాజు, వి.సుబ్బలక్ష్మి, జొన్నల సతీష్, ఇంద్రవాణి, డి.ప్రసన్న, కుందుం వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భవిత సెంటర్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం.చంద్రకుమారి, ఎస్కే బాల ఈశ్వరయ్యలను సన్మానించారు. డ్రాయింగ్ బుక్స్‌ను, విద్యాసామగ్రిని, స్నాక్స్‌ను అందజేశారు. భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డైమండ్స్ ఆధ్వర్యంలో టీచర్స్‌డే వేడుకలు

డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి, చినతాడేపల్లి, వెంకట్రావుపాలెం, లింగారాయుడిగూడెం, ఆరుగొలను, కుంచనపల్లి గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు, సీసీ డ్రెయిన్లు, చెరువు అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తు మందులకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేవి ఎడ్యూకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో దీక్ష డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ వారిచే గురువారం స్థానిక బ్రహ్మానందరెడ్డి కూరగాయల మార్కెట్‌లో శ్రామికులకు మత్తుమందులు–అనర్థాలపై అవగాహనా సదస్సు జరిగింది. సొసైటీ వ్యవస్థాపకుడు మల్లిపూడి మిత్ర మాట్లాడుతూ దేశ ప్రగతికి శ్రామిక శక్తే వెన్నుముక అన్నారు. ఉత్పత్తి లేనిదే శ్రమ వ్యర్థమని చెప్పారు. మత్తు మందులకు శ్రామికులు బానిసలైతే ఉత్పత్తి రంగం కుంటుపడుతుందన్నారు. మత్తు మందులు వల్ల వణుకు రావడం, లివర్, కిడ్నీలు పాడవటం, మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. శ్రామికులు మత్తు మందులకు దూరంగా ఉండాలని, తోటి కార్మికులు ఎవరైనా మందులకు బానిసలైతే మన సామాజిక బాధ్యతగా వారిని కూడా మంచి మనుషులుగా మార్చాలని, తమ వంతు సహకారం ఉంటుందని చెప్పారు. సీపీఐ నాయకులు రంగారావు, అధ్యక్షుడు చంద్రరావు, దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ పీర్ ఎడ్యుకేటర్ పి.వెంకటేష్, ఓఆర్‌డబ్ల్యూ నవీన్, కౌన్సిలర్ కృష్ణ, కార్మిక యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మత్తు మందుల అనార్థలపై అవగాహన

గృహాల సర్వే వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వామిత్వ యోజన ఫేజ్–1లో గ్రామ కంఠంలోని ప్రభుత్వ భూముల, ప్రైవేటు భూములు, గృహాల సర్వే వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వామిత్వ యోజనలో గృహాల సర్వే ప్రగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో అలసత్వం వహించే అధికారులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీ, అక్కయ్య నగర్, శివబాలాజీ నగర్, రెడ్డి అండ్ రెడ్డి లే అవుట్, హరిప్రియ నగర్, కొమ్మాయి చెర్వుగట్టు, పల్లాలమ్మ నగర్, మునిసిపల్ కార్యాలయం, ఐక్య నగర్, కనకవర్ష ప్రాంతాల్లోను, రూరల్ పరిధిలో పైడిపర్రు, అత్తిలి మండలంలో ఆరవల్లి, దంతుపల్లి, గుమ్మంపాడు, అత్తిలిలో కొంతభాగంతో పాటు పాలిలో విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ రూరల్ ఏఈ అల్లు రామకృష్ణ తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో లింగారాయుడిగూడెం, అమృతపురం, కుంచనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణకు హాజరైన ఉద్యోగులు

ఇరగవరం: పంచాయతీల అభివృద్ధికి అధికార్లు, ప్రజా ప్రతినిదులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అన్నారు. ఇరగవరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయితీ పురోగతి సూచికపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాస్ ఉద్యోగులకు పంచాయతీ పురోగతి సుస్థిర లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగింపు అభినందనీయం



గరికపాటి బాపయ్య శర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ పూర్తిగా తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జీవిత బీమా పెన్షనర్స్ సంఘం నాయకుడు గరికపాటి బాపయ్యశర్మ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల కనీస అవసరంగా మారిన జీవిత బీమా, ఆరోగ్య బీమాలను అభివృద్ధి చెందిన దేశాలలో సామాజిక బాధ్యతగా ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని తెలిపారు. మన దేశంలో బీమా ప్రీమియంపై జీఎస్టీ భారంగా పరిణమించిందన్నారు. జీఎస్టీని తొలగించాలని బీమా ఉద్యోగులు, ఇతర సంఘాలు చేసిన దీర్ఘకాల ఉద్యమానికి ఫలితంగా ప్రీమియంపై జీఎస్టీ తొలగింపు జరిగిందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి, జీఎస్టీ కౌన్సిల్‌కు, ప్రధానికి బాపయ్యశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ ప్రభుత్వంలో విప్లవాత్మక నిర్ణయాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు అమలు చేశారని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ చెప్పారు. గురువారం స్థానికంగా జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ యోగాసన కోచ్‌గా చంద్రశేఖర్



మోదుగ గుంటలో వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ యోగాసన, యోగాసన భారత్ నిర్వహించిన నాల్గవ జాతీయ యోగాసన కోచెస్ శిక్షణలో పాటియాలా ఎన్ఐఎస్ ఎన్ఐఎస్ శిక్షణ పొంది ఉత్తీర్ణులైన మండలంలోని మోదుగ గుంట జిల్లా పరిషత్ హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ జాతీయ యోగాసన కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని గురువారం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ నాయకుడు కట్టా జానకీరామయ్య అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉండి: గ్రామాల్లో ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, స్వమిత్వ కార్యక్రమానికి సహకరించాలని జెడ్పీ సీఈవో ఎం. శ్రీహరనాథ్ అన్నారు. గురువారం ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో పర్యటించి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా పరిశీలించి అధికారులు,సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు.